రచన - జూన్ 2004

# వ్యతిక్రమము

మనసుకి సంబంధించిన ఏ విషయాన్నీ ఇదమిత్థంగా ఇదీ అని నిర్వచించడం కొంచెం కష్టంగానే ఉంటుంది. స్నేహమనేది కూడా అంతే! ఆయా వ్యక్తుల అంతఃప్రకరణాల బట్టీ, ఆయా పరిస్థితులను బట్టీ స్నేహం కూడా రంగులు మారుతుంది, ముసుగులు ధరిస్తుంది. ఏదిఏమైనా కుటుంబరావూ, రాజేశ్వరరావూ విద్యార్థిదశ నుంచీ పరిచయస్థులు. ఒకరింటికి మరొకరింటికీ మధ్యనున్న అడ్డం రెండు వీధులు. వడగాలి వీచినప్పుడూ, వర్షం కురిసినపుడూ, వంట్లో నలతగా ఉన్నప్పుడూ తప్ప దాదాపు ప్రతిరోజూ సాయంత్రమూ, అనేక వనమహోత్సవాలు జరపబడి ఒక మొక్కా మొలవని ఆ ఊరి ఉద్యానవనమనబడేదానిలో కలుసుకుని కబుర్లాడుకొంటారు.

"నేటి సమాజమంతా అదృష్టానికి దగ్గర దారులు వెతుక్కోవడంలోనే మునిగిపోయింది. అధికంగా శ్రమించి, సన్మార్గంలో పయనించి లక్ష్యాన్ని సాధించేవారు కొద్దిమందే ఉండగా, అల్పంగా శ్రమించి, దగ్గరదారులు వెతుక్కొని అధికంగా అభివృద్ధి పొందిన వారు కోకొల్లలు. మోసాలూ, దోపిడీలూ, జూదాలూ, లంచాలూ - ఈ అవినీతి మార్గాలన్నీ సమాజాన్ని కలుషితం చేస్తున్నాయి" అన్నాడు కుటుంబరావు. ఆ మాటల్లో ఆవేదన కొట్టవచ్చినట్టు కనబడ్తోంది.

"నీతో వచ్చిన చిక్కేయిది. ప్రతి విషయాన్ని గతంతోనూ, గత తరం వారి నైతిక విలువల తోనూ పోలుస్తావు! అవినీతి అనేది అన్ని తరాల్లోనూ, అన్ని కాలాల్లోనూ, అన్ని దేశాల్లోనూ కొంచెం హెచ్చుతగ్గుల తేడాతో ఎప్పుడూ ఉన్నదే. అయితే, మిగతా సామాజికాంశాల వలే ఇదీ అభివృద్ధి చెందుతోంది. నీ మట్టుకు నువ్వు ఉద్యోగంలో ఉన్నంతకాలం 'లంచం' అనే మాటని తలబెట్టకపోయినా, లంచమిస్తేనే కాని నీ కొడుకు రఘుకి ఉద్యోగం దొరకలేదు! కట్నం తీసుకోకుండా నీ కొడుక్కి పెళ్ళి చేశావు కాని, కట్నమిచ్చిగాని నీ కూతురు శోభకి పెళ్ళి చేయ్యలేక పోయావు! ఆ పెళ్ళికి చేసిన అప్పులు తీర్చే బాధ్యత నీ కొడుకు మీద పడింది. అందుకని నీ కొడుకు బల్లకింద చేతులు చాస్తున్నాడు. విచారించి ఏం చెయ్యగలవు?" - రాజేశ్వరరావు కుటుంబరావు కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

"ఏమీ చెయ్యలేనన్న మాటా, ఏమీ చెయ్యలేదన్న మాటా నిజమే! పరిస్థితులతో రాజీపడి, ద్వంద్వనీతిని ప్రదర్శించాననే ఓ నేరభావన వెన్ను తడ్తోనే ఉంది."

"కనీసం నువ్వు ఏభై శాతం సన్మార్గంలో నడిచావు. ఆ సంతృప్తి చాలదా ఏం? అయినా మన తరంలో జరిగినట్టుగా ఈ తరంలో జరగాలని ఆశించడం అవివేకమే అవుతుంది.

అప్పుడున్నన్ని ఉద్యోగావకాశాలు ఈనాడు లేవు. ఆనాటి సంతృప్త జీవన నిర్వచనం ఈ నాటికి వర్తించదు. ప్రతివ్యక్తీ జీవనభృతికే కాకుండా, జీవనస్థాయిని పెంచుకోవడానికి పరుగులు తీస్తున్నాడు. అదనపు సుఖాలూ, సౌకర్యాలూ ఉచితంగా లభించవు. వచ్చేజీతానికీ, జీవించే తీరుకీ పొంతన లేకపోయినా, లేదా అదనపు బాధ్యతలు మోయవలసి వచ్చినా పెడదారులు ఆకర్షిస్తాయి. అందుచేత మీ వాడి మానాన్న వాణ్ణి వదిలెయ్యి. అనవసరంగా ఆలోచించి బుర్ర పాడుచేసుకోకు" అన్నాడు రాజేశ్వరరావు సలహా ఇస్తూ.

ఎన్నో సాయంసంధ్యల్లో ఈ రకమైన సంభాషణ వారిద్దరి మధ్య జరుగుతోనే ఉంది. పోను, పోనూ రాజేశ్వరరావుకి కుటుంబరావు మనసుకీ, మాటకీ మధ్య తెరలున్నాయని అనిపించసాగింది. రఘు విషయమై కేవలం తనిచ్చే సమర్ధన కోసం, జాలి కోసం కుటుంబరావు ప్రయత్నిస్తున్నాడని అనుకోసాగాడు. ఈ విధమైన ఆలోచనలు చోటుచేసుకోవడంతో కుటుంబరావు పట్ల రాజేశ్వరరావు ప్రవర్తనలో లీలగా మార్పులు వచ్చినా అవి కుటుంబరావు గుర్తించలేకపోయాడు.

శోభ పెళ్ళి కోసమని చేసిన అప్పుల్ని రఘు తీర్చేసి, ఇంటిని తాకట్టు నుంచి విడిపించాడు. ఆడవాళ్ళ బోసిపోయిన మెడలూ, ఖాళీ చేతులూ కాస్తంత బంగారంతో కళకళలాడసాగాయి. కటుంబరావు మనవడూ, మనవరాలూ నగరపాలక పాఠశాల నుండి మారి ఓ విద్యావిక్రయ శాలలో చేరారు. రెండు చక్రాల తొక్కుడు బండి స్థానాన ద్విచక్ర అంతర్దహనయంత్రవాహన మొచ్చింది. వెనకింటి పక్కింటాయన నైఋతి నున్న ఓ ఇరవై గజాల స్థలం అచ్చిరాక అమ్మేస్తోంటే, అది తమకి ఈశాన్యంలో కలుస్తుంది కదా అని రఘు దాన్ని కొనడం జరిగింది.

కుటుంబరావు తన కొడుకు ప్రవర్తన గురించి ఆలోచించటం మానాడో లేదో తెలియదు కాని, మాట్లాడడం మట్టుకు మానేశాడు. అయితే రాజేశ్వరరావు కుటుంబరావు కొడుకు ప్రవర్తన గురించి పట్టించుకోసాగాడు. మాత్సర్యమనేది మనసులో చోటుచేసుకోకుండా ఉండాలేకాని, అది ఒకసారి కనక ప్రవేశిస్తే పురుగు దొలిచినట్లు దొలిచేస్తుంది. శత్రువుగాని, తనకి సంబంధించనివాడు కాని అభివృద్ధిలోకి వస్తే అవినీతిపరుడని ఎలుగెత్తి చాటించవచ్చు. కానీ అదే స్నేహితులు కాని, బంధువులు కాని అయితే మనసులో నెలకొన్న మాత్సర్యాన్ని మాటల్లో వ్యక్తం కాకుండా ఉండడానికి చాలా ప్రయత్నమే చెయ్యాలి. ఒకవేళ ఆ ప్రయత్నాలు ఫలించి మాటల్ని అదుపులో ఉంచుకొన్నా, ముఖకవళికల్ని అదుపులో ఉంచుకోవడం అసాధ్యమనే చెప్పుకోవాలి. ఈ కారణంగా రాజేశ్వరరావు కుటుంబరావుని తరచుగా కలుసుకోవడం తగ్గించేశాడు.

కుటుంబరావు ఓ రోజున అడిగాడు.

"ఈ మధ్య నువ్విక్కడికి రావటం బాగా తగ్గించేశావు, ఏమిటి సంగతి?"

"ఆరుబయట అంతంతసేపు కూర్చుని బాతాఖానీలు చేస్తూ కూర్చుంటే ఆరోగ్యం పాడవుతుందని ఇల్లాలితో సహా అందరూ మందలించారు!" అన్న కప్పదాటు సమాధానమిచ్చాడు

రాజేశ్వరరావు.

మొదటిసారిగా అతని మాటల్లో ఏదో వెలితి కనిపించింది కుటుంబరావుకి.

కుటుంబరావేదో అనబోయేలోగానే రాజేశ్వరరావు మరలా అన్నాడు – "అన్నట్లు నేనూ, శ్రీమతీ ఉత్తర భారతంలోని పుణ్యక్షేత్రాలు చూడ్డానికి వెడ్తున్న సంగతి చెప్పడానికి వచ్చాను. మా రెండోవాడు అన్ని ఏర్పాట్లు చేశాడు. మళ్ళీ నెల దాటిన తర్వాతే కలుసుకోవడం."

నెలపైన వారం రోజుల తర్వాత కుటుంబరావు అక్కడ కూర్చుని ఉండగా రాజేశ్వరారావు వచ్చాడు.

"ఎప్పుడు తిరిగొచ్చారు? తీర్థయాత్రలు సవ్యంగా జరిగాయా? నన్ను కలుసుకోవడానికి ఇంటి దగ్గర అనుమతి దొరికిందా?" – కుటుంబరావు పేలవంగా నవ్వుతూ అన్నాడు.

పక్కనే కూర్చుంటూ, "ఏమిటీ, నీరసంగా కనపడ్తున్నావు? ఆరోగ్యం బావుంది కదా?" అన్నాడు రాజేశ్వరరావు.

కుటుంబరావు తగ్గు స్వరంలో అన్నాడు.

"అవినీతి నిరోధకశాఖ వారు, ఓ వ్యక్తి దగ్గర పని జరిపించడం కోసం లంచం తీసుకొం టూండగా మావాణ్ణి పట్టుకొన్నారు. విచారణ జరుగుతోంది. ప్రస్తుతానికి త్రిశంకు స్వర్గంలో ఉంచారు. వాడికిచ్చే అర్థజీతంతోనూ, నా కొచ్చే ఉపకారవేతనంతోనూ ఇల్లు గడవాలి. వాడిశిక్షకి నా మౌనమే కారణమనుకొంటాను. పరిస్థితులకి రాజీ పడ్డంతో పరువు పోయింది!"

రాజేశ్వరరావు మనసొక్క క్షణం నవ్వబోయింది. మరుక్షణంలో సిగ్గు పడింది.

"అయ్యో పాపం! అలానా?! నీ కొడుకు ప్రవర్తన విషయమై నిన్ను రాజీపడమని ప్రోత్సహించిన నేను కూడా కారణమేమోనే?" – అప్రయత్నంగా అన్నాడు.

"స్థానిక దినపత్రికల్లోనే కాకుండా ప్రఖ్యాత దినపత్రికల జిల్లా అనుబంధాలలో కూడా కులగోత్రాలతో సహా వివరిస్తూ పత్రికారంగం విరుచుకుపడింది. అంతే కాదు, ఈ ఉదంతం నా కూతురి కాపురం మీద కూడా ప్రభావం చూపించింది. అత్తమామలూ, భర్తా ఎద్దేవా చేయడంతో 'మీకిచ్చిన కట్నం కోసం అప్పులు చేయ్యవలసి వచ్చింది. వాటిని తీర్చడం కోసం మా అన్న లంచాలు పట్టడం ప్రారంభించాడు. దీని కంతటికీ కారణం మీరే!' అంటూ తిరుగు సమాధానం ఇచ్చింది. అహం దెబ్బతిని భర్త చెయ్యి చేసుకోవడంతో, ఆత్మాభిమానం దెబ్బతిని కట్టుబట్టలతో బయలుదేరి వచ్చేసింది" – కుటుంబరావు పూర్తి విషయం చెప్పాడు.

రాజేశ్వరరావు మనస్సు కలుక్కుమంది.

"వ్యవహారం అంత దాకా వెళ్ళిందా?"

"ఇంకా విను. మా కోడలు కట్నం విషయంపై ఏవో సైద్ధాంతికపరమైన విషయాలు మాట్లాడి ఓదార్చబూనుకొంటే, శోభ అపార్థంతో వదినగారి మీద విరుచుకుపడింది. కూతురి గోడు చూడలేని మా ఆవిడ, 'అసలు దీనికంతా మూలకారణం మీ చేతకానితనం. ఆ చేత్తో పుచ్చుకొని ఈ చేత్తో ఇచ్చేస్తే పోయేదానికి, ఆదర్శమంటూ గొప్పలకి పోయారు. చూడండి, ఏమైందో?!

అని నేరం అంతా నా నెత్తి మీదకు తోసేసింది! ఆవిడ కడుపు తీపి అలా అనిపించింది మరి," అన్నాడు కుటుంబరావు.

"మీ శోభ అత్తమామలు నా బావమరిదికి బాగా తెలుసున్నవారు. అతనితో బాటు నేనూ వెళ్ళి వాళ్ళకి నచ్చచెప్పో, బుద్ధి చెప్పో శోభ కాపురం సరిదిద్దే ప్రయత్నం చేస్తాను. నువ్వు నిశ్చింతగా ఉండు," అన్నాడు రాజేశ్వరరావు. ఈ మాటలు మనసులోంచి వచ్చాయి.

"శోభ విషయమై నీ సహాయం కోరదామని నేననుకొన్నాను. నువ్వే ఆ మాట ముందుగా అన్నావు, ధన్యవాదాలు. కాని కుర్రాడు కూడా గట్టెక్కాలి కదా?" - కుటుంబరావు మాటల్లో బెంగ గోచరించింది.

"మీ రఘు అధికారి ఏమంటున్నాడు?" - రాజేశ్వరరావు ప్రశ్నించాడు.

"వాస్తవానికి మావాడి కిచ్చే ముడుపుల్లో ముప్పాతిక శాతం ఆయనకే వెడుతుందట. వెళ్ళి గట్టెక్కించమని అర్థిస్తే 'నీ అజాగ్రత్త వల్లే ఇదంతా జరిగింది. నీ పాట్లు నువ్వు పడు. వాటికి మట్టుకు అడ్డురాను' అని చెప్పి చేతులు కడుక్కొన్నాడట. రఘు తన అధికారిపై నిందారోపణే చెయ్యగలగడు కాని, నిర్ధారణమైన సాక్ష్యాన్ని చూపించలేడు. అందుకని నోరు మూసుకొని కూర్చున్నాడు. అయినా అవినీతి నిరోధకశాఖ వారికి ఎవరో తెలుసున్నవారే ఉప్పందించారని రఘు గోలపెడ్తున్నాడు" అన్నాడు కుటుంబరావు.

తమ ఇంటి సంగతుల్ని ఏమాత్రం దాపరికం లేకుండా ఏకరువు పెట్టే కుటుంబరావు కొంపదీసి తన్ను కాని అనుమానిస్తున్నాడా అని రాజేశ్వరరావు అనుకొన్నాడు. వెంటనే అన్నాడు.

"కార్యాలయంలో సాటి ఉద్యోగులనేకమంది ఉంటారు. ఉప్పందించిన వాడు కన్ను కుట్టినవాడైనా కావొచ్చు. నీతి రక్షకుడైనా కావొచ్చు. అయినా కంగారు పడకు. వజ్రాన్ని వజ్రంతోటే కోత బెట్టాలి. అవినీతి నిరోధకశాఖ కూడా అవినీతికి అతీతం కాదు. వాకబు చేద్దాం" అంటూ అక్కణ్ణుంచి లేచాడు.

రాజేశ్వరరావు తన బావమరిదితో కుటుంబరావు వియ్యాలవారింటికి వెళ్ళి తనే కుటుంబరావైతే ఎలా ప్రాథేయపడ్డాడో అంతకు రెట్టింపుగా ప్రాథేయపడి, వరకట్నమనే సంప్రదాయంపై ఈ తరం యువతులు ఎలా స్పందిస్తున్నారన్న విషయంపై సుదీర్ఘోపన్యాసం చేసి, సర్దిచెప్పాడు. మార్గం సుగమమైన తరువాత, కుటుంబరావు శోభని తీసుకువెళ్ళి, మరిన్ని క్షమార్పణలు చెప్పుకొని, ఆమెను అత్తింట దిగబెట్టి వచ్చి సగం ఊపిరి తీసుకున్నాడు.

రఘు విషయమై రాజేశ్వరరావు నడుం బిగించాడు. 'తెలిసి ఉన్న వాడికి తెలిసిన వాడు' అన్న గొలుసు ప్రక్రియతో చివరికి ఎలాగైతేనే జిల్లా అవినీతి నిరోధకశాఖాధికారికి సన్నిహితుడైన ఓ వ్యక్తిని పట్టుకొన్నాడు. మొదట సందేహించినా ఆయన భరోసా మీద నాలుగేసి పరకలు మేలుజాతి నూజివీడు 'రసాలున్న రెండు గంపల్ని కొని, ఒకటి ఆయనింట నుంచి, ఆయన వెంట రాగా రెండో గంపతో జిల్లా అవినీతి నిరోధకశాఖాధికారి గుమ్మంలో అడుగు పెట్టాడు.

పరిచయాలైన తర్వాత రాజేశ్వరరావు క్లుప్తంగా పరిస్థితిని వివరించాడు.

"ఆయనకి పెళ్ళి కావాల్సిన మరో కూతురుంది. ప్రస్తుతం విజ్ఞాన శాస్త్రంలో పట్టభద్ర. తరగతిలో చివరి సంవత్సరం చదువుతోంది. ఈ పరిస్థితుల్లో కొడుకు ఉద్యోగం కనక పోతే ఆయన తేరుకోలేడు!"

"ఈ కుటుంబరావుగారింతకీ ఎవరు?" – ఆయన తన స్నేహితుడి వంక చూసి అడిగాడు.

"ఇంటిపేరుని బట్టి చూస్తే మనవాడే అయ్యుండొచ్చు. మరి శాఖా భేదం ఉందేమో చెప్పలేను!" అన్నాడా స్నేహితుడు.

రాజేశ్వరరావు వెంటనే కల్పించుకొని కుటుంబరావు కులగోత్రాలన్నీ వివరించాడు.

"కార్యాలయానికి వెళ్ళి కాయితాలు చూస్తేనే కాని ఏం చెయ్యకలిగిందీ చెప్పలేను. మీరు వచ్చి నన్ను పదిన్నరకి కలుసుకోండి. ఇంక ఇతన్ని తీసుకురానవసరం లేదు" అన్నాడు రంగారావనబడే ఆ అధికారి.

రాజేశ్వరరావు సరిగ్గా పదిన్నరకి ఆయన గదిలో ప్రవేశించాడు.

అప్పటికే రంగారావు ఆకుపచ్చరంగు అట్ట లోపల ఉన్న కాయితాల్ని పరిశీలిస్తున్నాడు. రాజేశ్వరరావుని చూడగానే కూర్చోమని సైగ చేశాడు.

రాజేశ్వరరావు ఓ కుర్చీలో కూర్చున్నాడు. ఆ గదిలో వారిద్దరూ తప్ప ఇంకెవరూ లేరు.

తను చదువుతున్న దస్తావేజుని రాజేశ్వరరావు ముందుకు తోస్తూ, "ఆ దస్తావేజులోని అన్నింటికంటే అడుగునున్న కాయితం ఓ ఆకాశరామన్న ఉత్తరం. దాని ఆధారంగానే శ్రీధర్ అనే ఓ ఉద్యోగిని దర్యాప్తు చెయ్యవలసిందిగా నియోగించాను. అతను వల పన్ని రఘుని పట్టుకొన్నాడు. ఈ కుర్చీలో కూర్చుని నేననవలసిన మాటలు కాదు కాని, ఒక పక్కన కోట్ల కుంభకోణాలు పెద్దఎత్తున జరుగుతోండగా, చిన్నా, పెద్ద ముడుపులు చెల్లిస్తేనే కాని పనులు జరగని సాంప్రదాయం మన దేశమేమిటి, ప్రపంచమంతా పాకిపోయింది" అన్నాడు.

రాజేశ్వరరావు దస్తావేజులోని కాయితాల్ని వేగంగా తిప్పుతూ, చివరగానున్న ఆకాశరామన్న ఉత్తరం చూసి విస్తుపోయాడు. రంగారావు మాటలు చెవిన పడడంతో దస్తావేజుని బల్ల మీద పెట్టి, ఆయన వైపు చూశాడు.

"క్రింది ఉద్యోగులు తయారు చేసి పెట్టిన కాయితాల్ని మరీ అధ్వాన్నంగా ఉంటే తప్ప, కొట్టిపారేయడం అన్ని సమయాలా సాధ్యం కాదు. పదోన్నతి కోసం వారికీ కొన్ని విజయాలు అవసరం. ఆ అవకాశాల్ని నిరోధించడం అధికారులకూ తగని పని. అందుచేత లౌక్యంగా ఈ దస్తావేజుని అయోమయంగా తయారుచేసి, శ్రీధర్‌ని హతాశుణ్ణి చెయ్యడానికి కొంత వ్యవధి అవసరం. ఈలోపుగా మీరు నాకో సహాయం చెయ్యాలి" అన్నాడు రంగారావు.

"చెప్పండి" అన్నాడు రాజేశ్వరరావు.

రంగారావు తనకే సహాయం కావాలో చెప్పాడు. రాజేశ్వరరావు మొద్దుబారిన మెదడుతో బయట అడుగు పెట్టాడు.

కళాశాల నుంచి ఇంటికి తిరిగి వస్తున్న కుటుంబరావు రెండో కూతురు రమకి దారిలో

ఎదురైై, రాజేశ్వరరావు ఆమెను ఓ పక్కగా తీసుకువెళ్ళి అరగంటసేపు మాట్లాడాడు.

"మీ అందరి కోసం మీ అన్నయ్య రఘు అపఖ్రథపాలయ్యాడు. రఘు ఉద్యోగం కనక పోతే మీ కుటుంబం తాలూకు భవిష్యత్ ఏమవుతుందో ఆలోచించు. నేను ముందస్తుగా నీతోనే మాట్లాడుతున్నాను. నీ అంగీకారం పొందిన తర్వాతే మరో అడుగు ముందుకు వేస్తాను".

రాజేశ్వరరావు మధ్యవర్తిగా రంగారావు రెండోకొడుక్కీ కుటుంబరావు రెండో కూతురు రమకీ వివాహ సంబంధం ఖాయమైంది. తాంబూలాలు పుచ్చుకొన్నవెంటనే రంగారావు పావులు కదిపాడు.

ఇదివరలో శ్రీధర్ని ఆశ్రయించిన నలుగురైదుగురి విషయంలో రంగారావు ఉదారంగా వ్యవహరించాడు. అందుకని ఏదో మాటవరుసకన్నట్టుగా అన్న రంగారావు మాటలు విని, శ్రీధర్ తను చెయ్యవలసింది రంగారావు అడక్కుండానే చేశాడు. రఘు మీది నేరారోపణ నిరాధారమైనదని ఆ దస్తావేజు అటక ఎక్కింది. రఘు మళ్ళీ కార్యాలయంలో అడుగు పెట్టాడు. ఆ కార్యాలయం అధికారికి మరోచోటుకి బదిలీ అయింది. తిని, తినిపించే అధికారికి బదిలీ అవడం ఆ కార్యాలయంలో చాలామందికి దుఃఖం కలిగించింది. వచ్చే కొత్త అధికారి ఎటువంటివాడో ఎవరికి తెలుస్తుంది?

రంగారావు కొడుక్కీ కుటుంబరావు కూతురికీ వందల కిలోమీటర్ల దూరంలో వున్న ఓ కొండమీది దేవాలయంలో వివాహం నిరాడంబరంగా జరిగిపోయింది.

అంతా సర్దుకొన్న తర్వాత మిత్రులిద్దరూ అలవాటుగా నగరోద్యానవనం దగ్గర కలుసుకొన్నారు.

రాజేశ్వరరావు గళం విప్పాడు.

"రంగారావుగారి రెండో కొడుక్కి ఉద్యోగమున్నా బ్రహ్మాండమైన మెల్ల కారణంగా వివాహం కాకపోవడమూ, పెళ్ళి కావల్సిన నీ రెండో కూతురికి అన్నగారంటే అభిమానం ఉండడమూ - నీ అదృష్టంగానూ, రఘు అదృష్టంగానూ భావించుకో! రంగారావు తన కొడుకు ఓ ఇంటివాడవడం కోసం కానీ కట్నం తీసుకోకుండా నీ కూతుర్ని తమ ఇంటి కోడలిగా చేసుకున్నాడు. స్వార్థంతో ఓ అవినీతి వ్యవహారాన్ని మూసిపెట్టి తనూ ఓ అవినీతికి పాల్పడ్డాడు. నువ్వు నీ కూతురి పెళ్ళికి కానీ కట్నం ఇవ్వకపోయినా, నీ కూతుర్నే లంచంగా యిచ్చావు. మరో సంగతి. నీ కొత్తల్లుడు పైరాబడి వచ్చే అవకాశమున్న కార్యాలయంలో పన్జేస్తున్నాడు. అతని దగ్గర నీతివాక్యాలు వల్లించడానికి ప్రయత్నించకు"

"ఆ మాత్రం ధైర్యం ఉంటే నా కొడుకునే మందలించి ఉండకలిగేవాణ్ణి! ఆదర్శాలను వల్లించడంలోనూ, ఆచరణలో పెట్టడంలో చాలా వ్యత్యాసముంది. రెండోదానికి చాలా ధైర్యముండాలి. అది లేకనే రఘు మీద నేరారోపణ జరిగిన తర్వాత విలవిలలాడిపోయాను. ఆర్థిక పరిస్థితులు మనిషి వ్యక్తిత్వం మీద ఎన్నో ఒత్తిడులను తీసుకొస్తాయని, వాటికి నేను లొంగిపోయానని ఒప్పుకొంటున్నాను. మా సమస్యనే నీ సమస్యగా తీసుకొని కష్టపడి మమ్మల్ని గట్టెక్కించావు. నీ ఋణం ఎలా తీర్చుకోవాలో నాకు తెలియదు. మరోమాట చెప్తేనేకాని నా

భారం తీరదు. ఒకానొక క్షణంలో ఆ ఆకాశరామన్న ఉత్తరం వెనుక నీ హస్తముందేమోనని నేననుమానించకపోలేదు. అటువంటి ఆలోచన వచ్చినందుకు సిగ్గుపడుతున్నాను. నన్ను క్షమించు!" అన్నాడు కుటుంబరావు.

"నీ పరిస్థితిలో నేనూ అలాగే ఆలోచించేవాణ్ణి. కానైతే నీ అనుమానం బెత్తెడు దూరంగా నిజం! ఆ ఉత్తరాన్ని రంగారావు కార్యాలయంలో చూశాను. దస్తూరి గుర్తుపట్టాను. ఆ ఉత్తరం రాసిన హస్తం మా రెండో వాడిది. ఆశ్చర్యపోకు! నేను మావాణ్ణి నిలదీసి అడిగితే చెప్పిన విషయం నీకు చెప్తాను.

"మా వాడి అధికారికి మీ వాడి కార్యాలయంలో జరగవలసిన ఏదో పని ఉంది. మాటల విషయంలో అది ప్రస్తావనకు రాగా, మావాడు 'అదెంతసేపు! అక్కడ పనిచేసే ఒకతను నాకు తెలుసు, అతని ద్వారా మీ పని చేయించేస్తాను' అని గొప్పలకిపోయి ఆ భారం తన మీద వేసుకున్నాడు. 'ఎక్కడైనా బావ కాని వంగ తోటలో బావ కాద'న్న ధోరణిలో మీ వాడు, 'నువ్వు చెబుతున్నావు కాబట్టి నాచెయ్యి పొడిగా ఉంచుకున్నా, పని జరగడానికి పైవాడి చెయ్యి తడపక తప్పద'న్నాడు. మావాడు తన పైవాడి దగ్గర పరువు నిలబెట్టుకోవడం కోసం, ఆ తడుపు ముడుపులు తనే చెల్లించి పని పూర్తిచేయించినా, నయాపైసా ఖర్చు లేకుండా పని చేయించడానికి మీ వాడు సహకరించలేదన్న అక్కసుతో ఆ ఉత్తరం రాశాడు. అవినీతి నిరోధక శాఖ వారు ఎవరో వ్యక్తిని ఎరగా పంపి మీ వాణ్ణి ఇరికించారు!"

కుటుంబరావు కొంతసేపు మౌనంగా ఉండి అన్నాడు.

"మీ వాడెంత ఖర్చు చేసిందీ చెబ్తే..."

రాజేశ్వరరావు కుటుంబరావు మాటలకు అడ్డుతగుల్తూ అన్నాడు.

"నువ్వా పని కనక చేస్తే ఈ సంగతి నీకు చెప్పేశానని వాడు నన్ను క్షమించడు! ఇప్పటికే తను ఆవేశంలో చేసిన పనికి చింతిస్తున్నాడు. నా మనసు భారమూ దింపుకోవడానికి ఆ ఉత్తరం ఎవరు రాసిందీ చెప్పాను. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ ఉత్తరం సంగతి మీ వాడితో చెప్పనని వాగ్దానం చెయ్యి. ఇదే నువ్వు తీర్చుకోవలసిన రుణం!"

"ఏది ఏమైనా ఆ ఉత్తరం మా వాడికో గుణపాఠం నేర్పింది. నువ్వు చెప్పినట్టుగా నేను నోరు మూసుకుకూర్చోవాల్సిందే! - కారణం చెప్పకుండా మీ వాడికి కృతజ్ఞతలు ఎలా చెప్పగలను?" అన్నాడు కుటుంబరావు.

"ధనచక్రాల మీద నడుస్తున్న వ్యవస్థలో ఉచితంగా పనులు జరగవన్న సత్యాన్ని మా వాడు గ్రహించాడు. అది వాడికి గుణపాఠమే! ఇక ముందర ఇద్దరూ జాగ్రత్తగా ఉంటారని ఆశిద్దాం" అన్నాడు రాజేశ్వరరావు.

జాగ్రత్త - గుర్తు తెలియకుండా ఆచూకీ ఇవ్వడంలోనా?

జాగ్రత్త- అంచాలు తీసుకోకుండానా? తీసుకోవడంలోనా?

పరుగు నేర్చినవాడు పడిలేస్తే నడుస్తాడే కాని మళ్ళీ పరుగు తీయడని ఎక్కడా లేదు. మళ్ళీ పరుగు కనక తీస్తే మట్టుకు మరింత జాగ్రత్తగా ఉంటాడు!